ప్రజాశక్తి
ఆదివారం 16 నవంబర్ 2025



సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు సంబంధించి బిసి, ఎసి, ఎస్‌టి నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఇ. అప్పన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థులు విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫోటోలు దరఖాస్తుకు జతచేసి నవంబర్ 25లోగా దరఖాస్తును జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆర్‌సిఎం స్కూల్, రూం నెంబర్ 8, పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు, పార్వతీపురం మన్యం జిల్లా వారికి సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8500187124, 9701786751, 9160801497 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం

దర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150 జయంతిని పురస్కరించుకుని జన్ జాతీయ గౌరవ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యాన బిర్సా ముండా 150 వ జయంతి ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా గిరిజనుల స్వాతంత్రం కోసం అంగ్లేయులతో యుద్ధం చేసి వారికి స్వేచ్ఛను కలిగించారన్నారు. ఎపి ట్రైబల్ వెల్ఫేర్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు తేజోవతి మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగఫలం మన స్వతంత్రమని అన్నారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బిర్సా ముండా అని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరిజన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, గిరిజన సలహా సంఘ మండలి సభ్యులు కృష్ణ బాబు, ట్రైకార్ సభ్యులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.



అడవి తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జన జాతీయ గౌరవ దివస్ వేళ

గిరిజన నాయకులకు అగౌరవం

పిలిచి అవమానించిన ఐటిడిఎ అధికారులు



నేలపై కూర్చొన్న గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎపిఒ

జన జాతీయ గౌరవ దివస్ ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ స్థానిక ఐటిడిఎ అధికారులు గిరిజన సంఘాల నాయకులను ఘోరంగా అవమానించారు. ఈనెల 1 నుంచి 15 వరకు బిర్సా ముండా జయంతి వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక ఐటిడిఎ ఆవరణలో ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. గిరిజనోద్ధారకుడు బిర్సా ముండా జయంతి రోజున జన జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఐటిడిఎ అధికారులు ప్రాజెక్టు పరిధిలోని గిరిజన సంఘాల నాయకులను శుక్రవారం ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు శనివారం మధ్యాహ్నం గిరిజన సంఘాల నాయకులు ఆరిక చంద్రశేఖర్, ఐ.రామకృష్ణ, గౌరమ్మ హాజరయ్యారు. అయితే హాజరైన గిరిజన సంఘాల నాయకులకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా నిర్వాహకులు వేయలేదు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన గిరిజన సంఘాల నాయకులు కొద్దిసేపు నేలపైనే కూర్చుని వెనుదిరిగారు. ఒక దశలో ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ నేలపై కూర్చొన్న గిరిజన నాయకుల వద్దకు వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినా గిరిజన నాయకులు శాంతించలేదు. గిరిజన జాతీయ నాయకుడు బిర్సా ముండా జయంతి రోజున తమను ఐటిడిఎ అధికారులు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 1న నిర్వహించిన బిర్సా ముండా జయంతి ప్రారంభ ఉత్సవాల రోజున కూడా గిరిజన సంఘాల నాయకులను ఐటిడిఎ అధికారులు ఖాతరు చేయకపోతే కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జోక్యం చేసుకుని వారికి కుర్చీలు వేయించారు. ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి సెలవులో వెళ్ళడంతో ఎపిఒ మురళీధర్ ఆధ్వర్యాన ఈ ఉత్సవాలు నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

ప్రజాశక్తి - కురుపాం

సమాజం బాగుండాలంటే- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే మనం నివసించే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే శాసన సభ్యులు తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఎపి ఆదర్శ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగత శుభ్రతే మన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందన్నారు. చదువుకునే పిల్లలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండాలన్నారు. పరీక్షల కోసం బట్టీపట్టి చదివితే సర్టిఫికెట్ వస్తుంది గానీ చదువు ప్రాముఖ్యత తెలియదని కలెక్టర్ పిల్లలకు హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడంతో ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి ఎంఇఒ ఎన్.సత్యనారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, సర్వ శిక్షాభియాన్ ఏపిసి తేజేశ్వరరావు, మండల టిడిపి కన్వీనర్ కె.వి కొండయ్య, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోలా రంజిత్ కుమార్, కూటమి నాయకులు బలగ రామకృష్ణ, సుఖేష్ చంద్ర పండా, కర్రి శ్రీను, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కలెక్టర్



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ ప్రభాకరరెడ్డి, అధికారులు

గుమ్మలక్ష్మీ పురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిడిఒ ఐవి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావాలని అన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ఎంఇఒ అధికారి చంద్రశేఖర్, తహశీల్దార్ శేఖరం, నాయకులు ప్రసాద్, దామోదర్‌రావు, కొండలరావు రామారావు, సుబ్బలక్ష్మి, రాజు, శరత్, బాలు, అప్పలస్వామి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ వికాస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. షాపుల్లో డస్ట్ బిన్ వాడకం, స్కూల్‌లో పిల్లలకు హ్యాండ్ వాష్‌పై ఎంపిడిఒ ఎస్.రమేష్ అవగాహన కల్పించారు. దుకాణదారుల వద్ద ఉన్న చెత్తను బయట ఇష్టానుసారంగా పడి వేయకుండా డస్ట్ బిన్‌లో ఉంచి పారిశుధ్య కార్మికులకు విధిగా అందించి బాధ్యతగా స్వచ్ఛంద కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, వ్యవసాయ అధికారి ప్రసాద్, ఎంఇఒ తిరుపతిరావు, సచివాలయ వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించిన అందెశ్రీ

ప్రజాశక్తి - పార్వతీపురం



అందెశ్రీకి నివాళ్లు అర్పిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు, నాయకులు

తన రచనలు, పాటల ద్వారా సమాజంలో మానవతా విలువలు పెంపొందించిన గొప్ప కవి, రచయిత అందెశ్రీ అని ప్రజానాట్యమండలి నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో ప్రజానాట్యమండలి కళాకారులు బోనెల పరశురాం ఆధ్వర్యాన ప్రజా కళాకారులు ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు పిల్ల లక్ష్మునాయుడు మాస్టారు, ఎం.తిరుపతిరావు, ప్రజానాట్యమండలి నాయకులు హిమరక రామారావు, పి.వరాలు, జె.రామయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు ముందుగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సామాజికంగా దళితులు, గిరిజనులు, వృత్తిదారులు, పేదల సమస్యలపై అనేక పాటలు రాసి మానవతా విలువలను పెంచిన మహోన్నతమైన విలువలు కలిగిన కళాకారుడు డాక్టర్ అందెశ్రీ అని కొనియాడారు. ప్రకృతి కవిగా ప్రజల్లో గుర్తింపు పొందిన గొప్ప కళాకారుడు అందెశ్రీ అని అన్నారు 'మాయమైపోతున్నడమ్మా మనిసన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు' అని లోకానికి మనిషి ఎలా ఉండాలనేది చెప్పిన గొప్ప మేధావి అని అన్నారు. జయజయ జయహే అని గీతం పాడి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు. అలాంటి కళాకారులు ప్రజా కళాకారులు ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కళాకారులని స్మరించుకున్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని అన్నారు. ప్రజా మన్ననలు పొందిన గొప్ప కవి అందెశ్రీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా పేదల గుండెల్లో నిలిచిపోతాడని అన్నారు. జోహార్ కామ్రేడ్ డాక్టర్ అంజశ్రీ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అనేకమంది కళాకారులు శ్రేయోభిలాషులు ప్రజానాట్యమండలి సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అత్యున్నత గౌరవం

ప్యానెల్ చర్చా మండలి సభ్యులుగా మనాలి నుంచి ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. ఈనెల 20,21 తేదీల్లో జిల్లా మనాలిలో జరగబోయే జియోస్పేషియల్ మ్యాపింగ్, డ్రోన్ సర్వేలపై జరిగే ప్యానెల్ చర్చా మండలి సభ్యుడిగా ఆహ్వానం వచ్చింది. భూ పరిపాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రిన్సిపల్ సెక్రటరీలకు నేషనల్ వర్క్‌షాప్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర భూపరిపాలన, సర్వే విభాగంలో జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి కనబర్చి, విశేష సేవలకు ఈ అరుదైన అవకాశం లభించింది. గతంలో రాష్ట్ర భూ పరిపాలన విభాగంలో జాయింట్ సెక్రటరీగా పని చేసిన అనుభవం ఉండడం, రెవెన్యూ, సర్వే, భూ రికార్డుల వంటి భూ పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన విషయాలపై ఆయనకు ఉన్న విస్తృత అనుభవం, నైపుణ్యం దృష్ట్యా రెండు రోజుల జాతీయ సమావేశం వివరణాత్మక షెడ్యూల్ పొందుపరుస్తూ సలహాలు, సూచనలు ఇవ్వాలని డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సస్ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఆహ్వానించింది.

17న పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పార్వతీపురం : జిల్లాలో ఈనెల 17న సాలూరు, భామినిలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఆర్ఆర్ ఏసురాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 పత్తి సీజన్లో కనీస మద్దతు ధర పొడుగు పింజ క్వింటాలు రూ.8110, పొట్టి పింజకు రూ.7710 చొప్పున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు పత్తిని ప్రభుత్వానికి అమ్ముకుని మద్దతు ధరలు పొందాల్సిందిగా కోరారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్ముకొనేందుకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి విఎఎలచే సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్ నందు స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. రైతులు తమ మొబైల్ ఫోన్లో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని కూడా శ్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోన్ నెంబర్: 9676608792, పాలకొండ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోన్ నెంబర్ : 9182361374 ATUL P.WAGHMARE - సిసిఐ కొనుగోలుదారులు 9529417114 ఫోన్ నెంబర్లకు సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అశోక్

నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్లో కలపాలి

బిర్సా ముండా జయంతి వేడుకల్లో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ కోరారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. బిర్సా ముండా చిత్ర పటానికి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు ఎం లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో గిరిజన ఉద్యోగుల రాష్ట్ర నాయకులు ఎస్.భాస్కర రావు, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన 78 ఏళ్లు అవుతున్నా గిరిజనులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జిల్లాలో వందశాతం గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాన్ని 5వ షెడ్యూల్‌లో కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామస్వామి, అధ్యక్షులు లక్ష్మణ్, తిరుపతిరావు, రామారావు, లక్ష్మయ్య, శ్రీను, మహిళా సంఘం నాయకులు వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన

గుమ్మలక్ష్మీపురం : స్థానిక పోస్టుమెట్రిక్ బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు మాట్లాడుతూ నేటి యువత బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకొని గిరిజన ప్రాంతాల హక్కులు, చట్టాలు పరిరక్షించుకోవాలని గిరిజనులంతా ఐక్యంగా ఉండాలని జిఒ 3 ప్రత్యామ్నాయ పోరాటానికి గిరిజన యువత, విద్యార్థులు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసులను ఇరువురి అంగీకారంతో రాజీ చేస్తామని, అందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు జడ్జి సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని జడ్జి తెలిపారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా, కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందని ప్రతి కాక్షిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సిఐ, ఎస్ఐ,న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఏర్పాటు

మక్కువ : మండలంలోని దుగ్గేరులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తలపెట్టిన పంప్‌డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనుల తరఫున పోరాడేందుకు శనివారం ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నారు. దుగ్గేరు సంత మార్కెట్ షెడ్ వద్ద సభ ఏర్పాటు చేశారు. గిరిజన నాయకులు రాయల సుందర్రావును కన్వీనర్‌గా, పీడిక అసిరి, ఊయక ముత్యాలు, మర్రి చెంచును కో కన్వీనర్లుగా, మొత్తం 32 మందితో దుగ్గేరు పంప్‌డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ గిరిజన గ్రామాలను ఖాళీ చేయిస్తూ, అటవీ భూములను దోచుకునేందుకు కార్పొరేట్ కంపెనీ లకు కట్టబెట్టే ఆలోచనలో ప్రభుత్వం తీసుకున్న పంపుడ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 84ను రద్దు చేయాలన డిమాండ్ చేశారు. 2 వేల మెగావాట్ల పంపుడు హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి దాదాపుగా వెయ్యి నుంచి 1500 ఎకరాల వరకు భూమి అవసరమని, దీని ద్వారా అనేక గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని అన్నారు. మన ప్రాంతంలోనే కాకుండా అల్లూరి సీతారామరాజు జిల్లా, కురుకుట్టి ప్రాంతాల్లోనూ ఇటువంటి పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా జనాలు పోరాడుతున్నా రని, వీరిపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నా వెనక్కి తగ్గకుండా జీవన పోరాటం సాగిస్తున్నారని మనం కూడా అదే స్ఫూర్తితో ఐకమత్యంగా ఉండి పోరాడినప్పుడే ప్రభుత్వాలు వెనక్కి తగ్గుతాయని, మన ప్రాంతాన్ని మనం కాపాడుకోగలుగుతామని అన్నారు. ఈ సభకు దుగ్గేరు, మూలవలస, మెండంగి, కొంజుపాక, ఎర్రసా మంత వలస, ఎర్రమట్టివలస, ఊటగెడ్డ, బొడ్డుసామంత వలస, కె.పెద్దవలస, మార్కొండపుట్టి, సీబిల్లి,



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

105 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - భామిని

కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 105 కేజీల గంజాయిని బత్తిలి పోలీసులు శుక్రవారం పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై పాలకొండ డిఎస్‌పి రాంబాబు శనివారం విలేకరులకు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కేరళకు ప్రతాప్ సింగ్ ఫైసల్, నదీమ్ సునీల్ ఒడిశాలోని రాయగడ జిల్లా, మునిగూడ వద్ద ఫోన్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తి వద్ద 105 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. తమ రాష్ట్రంలో విక్రయించేందుకు కేరళ వెళ్లేందుకు భామిని మీదుగా శ్రీకాకుళం హైవేకి చేరుకోవచ్చు తెలపడంతో ఈ మార్గం ద్వారా కారులో గంజాయి తరలిస్తున్నారు. బత్తిలి అంతర్‌రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద కారును తనిఖీ చేయడానికి ఆపినా కారు ఆపకుండా, ముందుకు వెళ్లడంతో అనుమానం వచ్చి కారును వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. కారులో డిక్కీలో అక్రమంగా రవాణా చేస్తున్న 52 ప్యాకెట్లు గంజాయి లభించింది. వీటి బరువు 105 కేజీలు కాగా, సుమారు రూ.2లక్షలు విలువ ఉంటుంది. కేసును దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమం ఎస్ఐ అప్పారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తుపానీయాలు వినియోగం వల్ల అనా ర్థాలు వస్తాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు అనంతరం అక్రమ మద్యం నివారణపై వివరించారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మిట్లతో ఒరిగిందెంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



సమ్మిట్లతో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగిందెంత? లక్ష్యం ఎంత గొప్పదైనా ఆచరణలో చిత్తశుద్ధి, నిజాయితీ, నిబ్ధత ఉంటేనే సంకల్పం నెరవేరుతుంది. లేదంటే ఉత్తుత్తిమాటలగానే మిగిలిపోతాయి. విశాఖ కేంద్రంగా గడిచిన రెండు రోజుల్లో జరిగిన సిఐఐ సదస్సుపై ఉమ్మడి విజయనగరం జిల్లాలో అచ్చంగా అదే రకమైన పబ్లిక్ టాక్ నడుస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర విభజన తరువాత దాదాపుగా పదేళ్లలో విశాఖపట్నం కేంద్రంగా గతంలో టిడిపి, ఆ తరువాత వైసిపి పలుమార్లు రూ.వేలకోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక ఒప్పందాలు జరిగాయి. కాదు... కాదు ... జరిగినట్టు చెప్పారు. ఇందులో కొన్ని మచ్చుకు పరిశీలిస్తే.... 2016లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖ వేదికగా సిఐఐ సదస్సుల్లో రూ.4.78 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 331 ఎంఒయులపై సంతకాలు జరిగాయి. ఐదు లక్షల ఉద్యోగాలు వస్తాయని అప్పట్లో చెప్పారు. 2018లో రూ.4.39 లక్షల కోట్ల పెట్టుబడులతో 734 ఎంఒయు జరిగాయి. 11 లక్షల మందికి ఉపాధి లక్ష్యమన్నారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం 2023లో పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు నిర్వహించి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు, ఆరు లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పింది. వివిధ సందర్భాల్లో ప్రభుత్వాలు చెప్పిన మాటలు ఎలా ఉన్నప్పటికీ ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. కానీ, ఆయా పరిశ్రమల్లో రాష్ట్రంలో ఎక్కడ ఎన్నిపెట్టారో ఆయా ప్రభుత్వాలకే ఎరుక. కానీ, ఉమ్మడి విజయనగరం జిల్లాకు మాత్రం ఒక్కటంటే ఒక్కటి కూడా రాలేదని జనం చర్చించుకుంటున్నారు. కానీ, తామంటే తామే పరిశ్రమలు తీసుకొచ్చామని టిడిపి, వైసిపి నాయకులు చెప్పుకొచ్చారు. ఇదే నిజమైతే గడిచిన పదేళ్లలో పారిశ్రామిక వృద్ధి రేటు పెరగాలి. కానీ, తగ్గుతూ వచ్చింది. అందుకనుగుణంగా పారిశ్రామిక వృద్ధిరేటు తగ్గింది. జిల్లాలో వ్యవసాయ, సేవా రంగాలతో పోలిస్తే పారిశ్రామిక రంగం వృద్ధి చాలా అథమంగానే ఉంటోంది. 2021-22లో రూ.4,940 కోట్ల మేర ఉన్న వార్షిక ఆదాయం 2022-23 నాటికి రూ.7,545 కోట్లకు పెరిగినప్పటికీ 2023-24 నాటికి రూ.6.604 కోట్లకు ఆదాయం తగ్గింది. తాజాగా పెట్టుబడులపై విస్తత ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గతంలో ఏం జరిగిందన్నది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కొత్త పరిశ్రమలు, ఉద్యోగాల సంగతి ఎలా ఉన్నప్పటికీ, ఉన్న పరిశ్రమలు మూతవేతకు ప్రభుత్వ విధానాలే కారణమయ్యాయని జనం చర్చించు కుంటున్నారు.

ముఖ్యంగా గరివిడి ఫేకర్ (ఫెర్రో ఎల్లాయిస్ ఫ్యాక్టరీ) వల్ల ఈ ప్రాంతంలో ఒకప్పుడు వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో కళకళలాడేది. నేడు ప్రాంతం నేడు వెలవెలబోతోంది. మాంగనీస్ గనులు కేటాయించకపోవడం, విద్యుత్ రాయితీలు తగినంతగా లేకపోవడం వల్ల క్రమంగా ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయివడం ఇందుకు కారణం. చివరికి 2023 నవంబర్‌లో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. ప్రస్తుతం అక్రమ తొలగింపులు మొదలయ్యాయి. గడిచిన ఏడాదిలోనే సుమారు 300 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. గరివిడి, గుర్ల మండలాలకు చెందిన దేవాడ, సదానందపురం మాంగనీస్ గనుల లీజు కాలపరిమితి ఆగస్టులో ముగియడంతో అందులో పనిచేసినవారంతా ఉపాధికి దూరమయ్యారు. ఈ ప్రభావం మరికొన్ని పరిశ్రమల్లో కనిపిస్తోంది. కొత్తవలస మండలంలో జిందాల్ పెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను ఈ ఏడాది జూన్‌లో మూతపడంతో 400 మంది కార్మికులకు జీవనోపాధి కోల్పోయారు. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఇంపెక్స్ సహ మరో 4 పెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటంతో 1500 మంది ఉపాధికి గండిపడింది. మెరకముడిదాం మండలం గర్భాంలో ఆంధ్ర పెర్రో ఎల్లాయిస్ పరిశ్రమను 2020లో మూసేయడంతో 600 మంది ఉపాధి పోయింది. గజపతినగరం నియోజకవర్గం మరుపల్లి వద్ద ఓలం జీడి పిక్కల పరిశ్రమ మూతతో 600 మంది పని కోల్పోయారు. జామి మండలం భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ మూతకారణంగా 400 మంది, చిన్నాపురం ఎ.ఎస్ జ్యూట్ మిల్లు మూసివేతతో 700 మంది ఉపాధికి దూరమయ్యారు. శృంగవరపుకోట ప్రాంతంలో వివిధ కారణాలతో 10 క్వారీలు మూతపడి 800 మంది ఉపాధికి దెబ్బ తగిలింది. వీటితోపాటు చిన్నాచితకా పరిశ్రమలు జిల్లా అంతా కలిపి 50 వరకు మూతపడ్డాయి. రోడ్లు, భవనాలు వంటి నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో జిల్లా వ్యాప్తంగా చాలా వరకు స్టోన్ క్రషర్స్ ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. మరికొన్ని ఇప్పటికే మూతపడ్డాయి. ఈ ప్రభావం కూడా పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో వెయ్యి కుటుంబాలపై పడింది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు జరిగి మూడేళ్లు కావస్తున్నప్పటికీ ప్రభుత్వరంగంలోగానీ, ప్రైవేటు రంగంలోగానీ ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని మన్యం వాసుల్లో చర్చనడుస్తోంది. ఇటువంటి తరుణంలో ఈనెల 14, 15వ తేదీల్లో మరోసారి విశాఖ కేంద్రంగా జరిగిన సిసిఐ సదస్సులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగిందెంతో అంటూ జనం చర్చించుకుంటున్నారు.



అంగన్‌వాడీ టీచర్లకు కిట్లను అందిస్తున్న సిడిపిఒ రాజ్యలక్ష్మి

కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సిడిపిఒ కె.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో పిల్లల బరువులు, ఎత్తులు సక్రమంగా తూచి వారి పెరుగుదలకు పోషణ స్థితి తెలుసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకానికి అర్హులైన లబ్ధిదారులను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎస్‌ఎ మేనేజర్ సిహెచ్ రమణమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, రేవతి, సులేక, బిపిని కామేష్, టాటా ట్రస్ట్ జగన్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదలందరికీ పక్కా గృహాల నిర్మాణం

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రంలో పేదలందరికీ పక్కా గృహాలు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి అన్నారు. పిఎంఎవై పథకంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో గృహ ప్రవేశాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహాలను అందించడమే పిఎంఎవై 2.0 పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జి.అచ్యుతయ్య, ఎస్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

బాల్య వివాహాలు జరగకుండా గ్రామస్థాయిలో అంగన్‌వాడీ వర్కర్లే అరికట్టాలని పిల్లల సంరక్షణ జిల్లా అధికారి సత్యనారాయణ, లీగల్ అధికారి శ్రీధర్ అన్నారు. శనివారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిడిపిఒ జి.రజని దుర్గ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై అవగాహన కల్పించి గ్రామస్థాయిలో పకడ్బందీగా బాల్యవివాహాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అంగన్వాడీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మేజర్ పంచాయతీ కార్యాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, ఇఒ పి.వి.గిరి, సచివాలయాల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా విద్యార్థులు సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఎక్సైజ్ ఎస్ఐ జి.రాజశేఖర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం. కుమార్ స్వామి ఆధ్వర్యంలో చెడు వ్యసనాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, నాటుసారా లాంటి మత్తుపదార్థాల బారిన పడి విలువైన జీవితాలను కోల్పోవద్దని తెలిపారు. విద్యార్థి దశ నుండే సక్రమంగా చదువుకుంటే ఉన్నత స్థానంలో స్థిరపడవచ్చు అన్నారు. కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు రైస్ మిల్లర్ల యాజమానులకు ఆదేశించారు. శనివారం స్థానిక కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టకూడదని కొనుగోలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుండి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోనె సంచులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సివిల్‌సప్లై డిటి జి.ప్రసాదరావు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

సామూహిక వంటశాలలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం



నిరసన తెలుపుతున్న ఎండిఎం కార్మికులు

సామూహిక వంటశాలలను రద్దు చేయాలని మధ్యాహ్న భోజన పథకం సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి బడి పిల్లలకు రుచికరమైన తిండిని అందిస్తున్న కార్మికులకు కనీస వేతనం లేదన్నారు. కుకింగ్ బిల్లులు నెలనెల సక్రమంగా అందడం లేదని, వంట నిర్వాహకు అప్పులు తెచ్చి వడ్డీలు పడుతున్నామని, వారి వ్యవస్థాపరంగా ఒక్కసారిగా సేవ చేస్తున్న వంట కార్మికులకు ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని చెప్పారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన తమ బతుకులు మారడం లేదని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సామూహిక వంటశాలలు ఏర్పాటు చేసి, నిర్వాహకుల బతుకులను రోడ్డు పాలు చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి వెంకటరమణ, సిఐటియు నాయకులు ఆర్ రాము, మిడ్డే మీల్ కార్మికులు యస్. కురమమ్మ, వై.సావిత్రి, సిహెచ్ వసంత, లక్ష్మి, వల్లమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులో వివక్ష

ప్రజాశక్తి - పాలకొండ

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించడంలో గందరగోళం కనిపించిందని, నగర పంచాయతీ అధికారులు పూర్తిగా వివక్ష చూపించారని ఆరోపణ వినిపిస్తున్నాయి. 20 వార్డులు ఉండగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేవలం ఒకటో వార్డు, నాలుగో వార్డులో కుమ్మరించడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. 14వ వార్డు పేరుతో గారాలకాలనీలో నిధులు కేటాయించడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. గారకాలనీ పరిధిలో 15,16,17,18 వార్డులకు సంబంధించిన ప్రజలు నివాసం ఉంటున్నారు. 14వ వార్డులో ఎస్సీలు లేరు. అయితే గారా కాలనీ 14వ వార్డులో ఉన్నట్లు చూపించడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతంపేట

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు స్థానిక గ్రంథాలయ అధికారి జబ్బురు గణేష్ బాబు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. పిల్లలకు విజ్ఞాన అందించే పుస్తకాలు కథలు, జనరల్ నాలెడ్జ్, ప్రయోగాలు, వేదికగణితం, జాతీయ నాయకుల జీవిత విశేషాలు, కథలు పుస్తకాలు అందించారు. అంతే కాకుండా విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే గ్రూప్స్ పుస్తకాలు ఉన్నాయన్నారు. ఇవే కాకుండా దిన, వార, మాస పత్రికలు కూడా అందరికీ అందుబాటులో వున్నాయి. వీటిని చదువు కొని విజ్ఞాన వంతులు కావచ్చు అని చెప్పారు. అంతేకాకుండా ఉద్యోగాలు కూడా పొందే అవకాశాలు ఉంటాయి అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ప్రధానం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

దైనందిక జీవితంలో శుభ్రతే ప్రధానమని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు.

శనివారం స్వచ్ఛాంధ్రా- స్వర్ణంధ్రా కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్రా- స్వర్ణంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. జిల్లాలో శానిటేషన్, వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థినులు స్వచ్ఛాంధ్రా- స్వర్ణంధ్రా కార్యక్రమంపై వేసిన డ్రాయింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, సహాయ వైద్య ఆరోగ్యశాఖాధికారి వినోద్, జిల్లా మలేరియా అధికారి జగన్మోహన్ రావు, సోషల్ వెల్ఫేర్ డిడి ఎం.శ్యామల, డిఇఒ రాజ్‌కుమార్, కలెక్టరేట్ ఎఒ చిన్నారావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తి, రెవెన్యూ సిబ్బంది, వైద్య కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: స్థానిక మున్సిపాల్టీలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని కమిషనర్ టిటి రత్న కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయ జంక్షన్ వరకూ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి మానవహారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిఇ ప్రసాద్, శానిటేరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరు: ర్యాలీ చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, ప్రజలు

సీతానగరం : మండల కేంద్రంలో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్‌ఎన్ ప్రసాద్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం పెదబోగిలి, అంటిపేటలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ అప్పలనాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌సి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని గౌడువీధికి సమీపాన ఎంఆర్‌సి నూతన భవన నిర్మాణానికి శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ఎంతగానో పాటుపడుతుందని, అందులో భాగంగా సర్వ శిక్ష అభియాన్ పథకం ద్వారా రూ.53 లక్షలతో ఎంఆర్‌సి భవనం మంజూరైందని, నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో పాటించి త్వరతగతిగా పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నాయకులు బలగ రామకృష్ణ, సుకేశ్, కర్రి శ్రీను, చంటి, సాయి, మండల విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిఎంఎవై సర్వేలో రహస్యమెందుకు? : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోనితూరుమామిడిలో హౌసింగ్ అధికారులు శుక్రవారం చేసిన పిఎం ఆవాస్ యోజన సర్వే రహస్యంగా చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు తప్పుబట్టారు. మండలంలో ఇల్లు కట్టుకుంటామన్న ప్రతి లబ్ధిదారునికీ ఇంటింటా సర్వే చేయాలని, పిఎంఎవై సర్వేలో రహస్యమెందుకని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తూరుమామిడిలో లబ్ధిదారులతో కలిసి మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ అధికారులు చేసిన పిఎం ఆవాస్ యోజన సర్వే రహస్యంగా చేశారని, టిడిపి కార్యకర్తలు చెప్పిన వారికే సర్వే చేశారని, స్థానిక, టిడిపి కార్యకర్తలను పక్కను పెట్టుకొని సర్వే చేసి లబ్ధిదారులకు ఫోటోలు తీశారని తెలిపారు. మండల హౌసింగ్ అధికారులు టిడిపి పార్టీకి తాబేదార్లా? అధికారులా? అని మండిపడ్డారు. గతంలో కూడా జగనన్న కాలనీ, అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించకుండా స్థానిక సర్పంచ్‌కు రూ.6 లక్షలు బిల్లులు చేశారని, లోకాయుక్తలో కేసు ఉంటుండగా జగనన్న కాలనీ అభివృద్ధి పనుల్లో పలు అక్రమాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే మండలం సర్వసభ్య సమావేశంలో పిఎం ఆవాస్ యోజన పథకం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తామని చెప్పి రహస్యంగా వచ్చి సర్వే చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఇందులో ఏ మతలబు వుందో చెప్పాలన్నారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకుంటాం సర్వే చేయండని అడిగితే టిడిపి కార్యకర్తలను అడగండని స్వయంగా హౌసింగ్ ఎఇ చెబుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క తూరుమామిడిలోనే టిడిపి కార్యకర్తలు చెప్పినట్లు సర్వే చేస్తున్నారా లేక మండలమంతా ఇలాగే సర్వే చేస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా హౌసింగ్ అధికారులు లబ్ధిదారులు అందరినీ పార్టీలకు అతీతంగా పిఎంఆవాస్ యోజన సర్వే చేసి, లబ్ధిదారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. అలా కాకుంటే సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని, ప్రజలను కదిలించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇది ఎలా ఉండగా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో సర్వే చేపడతామని హౌసింగ్ ఎఇ సింహాచలం తెలిపారు.



గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

విశాఖలో డిసెంబరు 31 నుంచి జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. శనివారం కొమరాడలో సిఐటియు జాతీయ మహాసభలకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్నట్లు తెలిపారు. జనవరి 4న ఆర్కే బీచ్ వద్ద జరగనున్న భారీ బహిరంగ సభకు కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కాబట్టి కార్మికులంతా ఈ మహాసభలను పాల్గొని జయప్రదం చేసి వారి హక్కుల సాధనకు, పోరాటాలకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి భవన నిర్మాణ కార్మికులు గౌర్నాయుడు, ఆశా, అంగన్వాడీ, వివిధ రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ ఆధ్వర్యంలో బిర్సాముండా 150వ జయంతోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన జాతికి బిర్సా ముండా చేసిన సేవలను కొనియాడారు. శ్రీకాకుళం అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పృథ్వీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ బిర్సా ముండా గిరిజన జాతికి సంబంధించిన అనేక హక్కులపైనా, భూ సమస్యలకు సంబంధించిన హక్కులపై పోరాడారని అటువంటి బిర్సా ముండాను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మైదాన ప్రాంతాల విద్యార్థులతో పోల్చుకుంటే ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలున్నాయని, సద్వినియోగపరచుకోవాలని అన్నారు. ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి మాట్లాడుతూ గిరిజన హక్కులను కాపాడడంలో బిర్సా ముండా విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐటిఐ నుండి ఐటిడిఎ ప్రాంగణం వరకు జన జాతీయ గౌరవ దివస్ కార్నివాల్ ర్యాలీని విద్యార్థులచే నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. తర్వాత ఐటిడిఎ మీటింగ్ హాల్లో గిరిజన స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎస్‌వి గణేష్, ఎఒ వి.సునీల్, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, సిఎంఒ చిరంజీవులు, స్థానిక ప్రజాప్రతినిధులు సవరతోట మొఖలింగం, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కురుపాం: బిర్సా ముండా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సాలూరు: బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో గిరిజన సంఘాలు సమస్యలు పరిష్కారానికి పోరాడాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. బిర్సా ముండా జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే బ్రిటిష్ వారి ఆగడాలను ఎదురించిన పోరాట యోధుడు బిర్సా ముండా అని అన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయులు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కొత్తవలసలో...

మండలంలోని కొత్తవలసలో బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం స్థానిక గిరిజనులతో కలిసి దేశభక్తి, అభివృద్ధి లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కోట లక్ష్మణ, సచివాలయ సిబ్బంది, స్థానిక గిరిజనులు, పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు జియమ్మవలస మండలం రామభద్రపురంలో బిర్సాముండా చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. జయంతి సందర్భంగా చిన మేరంగి సిహెచ్‌సి, రామభద్ర పురం పిహెచ్‌సిల్లో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షులు యస్.మాణికేశ్వర రావు, వి.సింహాచలం, ట్రైబల్ రైట్స్ పోరం అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

సీతంపేట :మండలంలోని కీసరజోడు పంచాయతీ దిగువకోలవరాయిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో బిర్సాముండ 150వ జయంతి సందర్భంగా ఆదివాసీ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెలుగు అసోసియేషన్ కార్యదర్శి బాణాల సంజీవరావు మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ పోగ్రామ్ కోఆర్డినేటర్ బి.క్రాంతికుమార్, కార్యకర్తలు, కీసరజోడు గ్రామ సచివాలం సెక్రటరీ సంతోష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో...

కురుపాం : మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురిబిలిలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో శనివారం మొండెంఖల్ సచివాలయం వద్ద బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో బిర్సా ముండా 150 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అజారి, పంచాయతీ కార్యదర్శి వై.వెంకటనాయుడు, మాజీ సర్పంచ్ పువ్వుల పత్తి, సచివాలయ సిబ్బంది, గ్రామ యువత మహిళలు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

కుష్టు వ్యాధి నిర్మూలనకు విశేష కృషి చేయాలని, అపోహలు వదిలి చికిత్స పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17నుంచి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాలు నిర్వహించాలని, కుష్టు వ్యాధిపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కుష్టు వ్యాధి కేవలం మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే సాధారణ అంటువ్యాధని, భయంకరమైన వ్యాధి కాదని, చికిత్స తీసుకుంటే క్రమేపి తగ్గుతుందని ఆయన స్పష్టం చేశారు. చికిత్స తీసుకునే సమయంలోనూ, తర్వాత కూడా ఈ వ్యాధి ఇతరులకు వ్యాపించదని పేర్కొన్నారు. చర్మంపై తిమ్మిరి (స్పర్శ తెలియకపోవడం) లేత మచ్చలు, చేతులు, కాళ్లలో తిమ్మిరి, బలహీనత, ముఖంపై బొడిపెలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కుష్టు వ్యాధి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులకు కుష్టి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు వ్యాధికి సంబందించి చిత్రాలు, కథలు కుష్టు వ్యాధిపై రంగుల చిత్రాలు చూపించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు పచ్చకామర్లు, మలేరియా, కుష్టు వ్యాధి, టి.బి, ఎనిమియా వ్యాధులపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రతి విద్యార్థి శుభ్రతను పాటించాలని, తరచూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ముఖ్యంగా తిన్న తర్వాత, బయటి నుంచి వచ్చిన తర్వాత చేతులు శుభ్రపర్చుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే శరీరానికి ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డిఇఒ రాజ్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ విజయగౌరి, మలేరియా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కానరాని గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 14 నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ స్థానిక శాఖా గ్రంథాలయంలో ఎక్కడా కాన రాలేదు. గ్రంథాలయ అధికారి లేకపోవడంతో వారోత్సవాలు నిర్వహణ కొరవడింది. ఇక్కడ గ్రంథాలయ అధికారిగా విధులు నిర్వహించిన ఎం.వెంకటేశ్వరరావు ఈ ఏడాది జులై 31న ఉద్యోగ విరమణ చేయడంతో విజయనగరం జిల్లా రేగిడి ఆముదాలవలస మండల గ్రంథాలయ అధికారి పి.ఈశ్వరరావుకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయనకు వీరఘట్టం, వంగర మండలాల గ్రంథాలయ అధికారిగా ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఏ గ్రంథాలయంలోనూ సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారు. దీంతో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు స్థానిక గ్రంథాలయం దూరమైందని చెప్పాలి. ప్రతిరోజు పదుల సంఖ్యలో గ్రంథాలయానికి పాఠకులు వస్తున్నారు. వారికి సకాలంలో పత్రికలు, వివిధ రకాల పుస్తకాలు అందజేయడం, నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రెగ్యులర్ గ్రంథాలయాధికారిని నియమించి పాఠకులకు సరైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సందడి లేని వీరఘట్టం గ్రంథాలయం

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ

మున్సిపల్ కార్మిక వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కోశాధికారి సిహెచ్ సంజీవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యవర్గ సభ్యులు ఎం వీర నాయుడు తదితరులు శనివారం కమిషనర్ రత్నరాజును కలిసి మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల రెండు నెలల్లో వేతన బకాయిలు ఉన్నాయని, నవంబర్‌లోనూ పూర్తవుతుందని, కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు వచ్చేలా చూడాలన్నని కోరారు. దసరా ఉత్సవాల్లో పనిచేసిన కార్మికులకు నేటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మిక వేతనాలు చెల్లింపునకు సకాలంలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్మిక సమస్యలతో పాటు ప్రజలు ఆరోగ్య భద్రత పరిశుభ్రత ఉండాలంటే కనీస మౌలిక సదుపాయాలు పరిష్కారానికి ఆందోళన సిద్ధమవుతామని యూనియన్ ప్రతినిధి బృందం అన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

సీతంపేట: మండలంలోని గెడ్డకోల, కొరసంగి గ్రామాల మధ్యలో ఉన్న బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉందని, వెంటనే బ్రిడ్జి నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ బ్రిడ్జ్ పాడైపోవడం వల్ల పాలకొండ నుంచి అంటికొండ వెళ్లే బస్సు సర్వీసులను నిలిపివేయడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో విద్యార్థులు కాలేజీలకు, పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఎవరైనా అనారోగ్యానికి గురైతే అంబులెన్స్‌లు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ ఈ బ్రిడ్జిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గడగమ్మలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని గడగమ్మలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, చిన్నారులు, జ్వర పీడితులు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ సుభారతామని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, 104 సిబ్బంది ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

వీరఘట్టం: మండల పరిధిలోని చినగోరా కాలనీ సమీపంలో శనివారం నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించగా 1400 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేసిన బెల్ట్ షాపులు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామస్తులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

పాచిపెంట: పశ్చిమ బెంగాల్‌కు చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి శుక్రవారం మతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మోదుగ పంచాయతీ విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మోదుగ పంచాయతీ కాట్రగుడ్డి గ్రామం వద్ద వెస్ట్ బెంగాల్‌కు చెందిన రంజిత్ రావు అనే వ్యక్తి వారం రోజుల క్రితం హరిత రహదారి కాంట్రాక్టర్ వద్ద కూలి పని నిమిత్తం చేరాడు. అప్పటి నుంచి పని సరిగా చేయకుండా మతిస్థిమితం లేకుండా చుట్టు పక్కల తిరుగుతూ సరిగా ఆహారం తీసుకోకపోవడం వల్ల చలి కారణంగా చనిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతునితో పాటు పనిచేస్తున్న గ్రామస్తులకు అప్పగించి స్వగ్రామానికి పంపించినట్లు ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు.

17 మందిపై బైండోవర్

వీరఘట్టం: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్ షాపులు నిర్వహించిన 17 మందిపై శనివారం తహశీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రతకాలంటే అనేక మార్గాలు ఉన్నాయని, ఈ బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల పరువు ప్రతిష్టలు దెబ్బతింటాయని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.